క్లుప్తంగా

అనంత్‌శంకర్‌కు డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఈసీఈ విభాగం పరిశోధక విద్యార్థి ఎల్లపల్లి అనంత్‌శంకర్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఎస్.వరదరాజన్ ఆధ్వర్యంలో 'ఎనలిటికల్ అప్రొచెస్ విత్ ఇన్‌క్రీజింగ్ డేటా హైడింగ్ కెపాసిటీ అండ్ సెక్యూర్డ్ ట్రాన్స్‌మిషన్ ఆఫ్ మెడికల్ ఇమేజెస్' అనే అంశంపై ఆయన పరిశోధన పత్రాలు సమర్పించారు.

కాంక్రీట్ తొలగింపునకు వినతి



మాట్లాడుతున్న హేమంత్‌కుమార్

తిరుపతి కల్చరల్ : మాల్వాడీ కాలువలో సిమెంట్ కాంక్రీట్ తొలగించి, కపిలతీర్థం నుంచి వచ్చే వర్షపు నీరు భూమిలో ఇంకేందుకు చర్యలు తీసుకోవాలని కాలువ పరిరక్షణ కమిటీ ప్రతినిధులు హేమంత్‌కుమార్, మునిరత్నం కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. 15 ఏళ్ల క్రితం మాల్వాడీ కాలువ ద్వారా ప్రవహించే వర్షపు నీరు భూమిలో ఇంకేందని, దీంతో చుట్టు ప్రక్కల ప్రాంతాలలో భూగర్భజలాలు పుష్కలంగా ఉండేవని వెల్లడించారు. సమావేశంలో కమిటీ ప్రతినిధులు ఆనంద్, డాక్టర్ గంగిరెడ్డి, గంగాధర్, సోమశేఖర్, విజయభాస్కర్‌రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఫలితాల విడుదలకు..



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో డిగ్రీ, పీజీకి సంబంధించిన రీవాల్యుయేషన్ ఫలితాలను వెంటనే విడుదల చేయాలని గిరిజన నవ సమాజ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పాలిత్య శివ శంకర్ నాయక్ కోరారు. శనివారం ఈ మేరకు రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా ఫలితాలను విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ఒక్కో పేపర్‌కు రూ.2వేల చొప్పున చలానాలు కట్టించుకుని, ఇప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రెండు వారాల్లో ఫలితాలను విడుదల చేయకుంటే ఏడీ బిల్డింగ్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు చంద్రశేఖర్ నాయక్, బాలు నాయక్, మున్నా, ప్రశాంత్ నాయక్, దిలీప్ పాల్గొన్నారు

ఘనంగా 'ఎస్ఆర్' వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి తుడా : నగరంలోని కచ్చపి ఆడిటోరియంలో శనివారం ఘనంగా ఎస్ఆర్ విద్యాసంస్థల 8వ వార్షికోత్సవం నిర్వహించారు. సంస్థల అధినేత చలమకుంట శంకర్‌రెడ్డి, నలంద విద్యాసంస్థల అధినేత ఓబుల్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. శంకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి ఉత్తమ పౌరులను అందించడమే ఎస్ఆర్ విద్యాసంస్థల లక్ష్యమని తెలిపారు. అకడమిక్ విద్యతో పాటు, స్పోర్ట్స్, సైనిక్ శిక్షణలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. అనంతరం డైరెక్టర్ ప్రవీణ, అతిథులతో కలసి పలు విభాగాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పుస్తక ప్రదర్శనపై దాడి హేయం

తిరుపతి కల్చరల్ : నగరంలోని ఇస్కాన్ రోడ్డులోని మైదానంలో భారతీయ విద్యా భవన్ వారు ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనపై మతోన్మాదుల దాడి హేయమని సీపీఎం, సీపీఐ నేతలు మండిపడ్డారు. శనివారం వారు మాట్లాడుతూ రాత్రి 8.30 గంటల సమయంలో దుండగులు కిరణ్ కుమార్, తుమ్మ ఓంకార్ దౌర్జన్యానికి దిగారని, అడ్డుకోబోయిన సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజును అసభ్య పదజాలంతో దూషించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాలాంధ్ర పుస్తక ఆలయం వద్దకు వచ్చి పెరియార్ జీవిత చరిత్ర పుస్తకాలను తొలగించాలని హుకుం జారీ చేశారన్నారు. మతోన్మాద గూండాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రచయితలు మేధావులపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులు వెంటనే స్పందించి రౌడీమూకను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

పీజీ సెట్, ఆర్-సెట్ కన్వీనర్‌గా వెంకటేశ్వర్లు



తిరుపతి సిటీ : ఏపీ పీజీ సెట్, ఏపీ ఆర్-సెట్ కన్వీనర్‌గా ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థ సంచాలకుడు ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఏపీ లా సెట్ కన్వీనర్‌గా పద్మావతి మహిళా వర్సిటీ ప్రొఫెసర్ టి.సీతా కుమారి నియమితులయ్యారు.

• నయనానందం



శ్రీగోవిందరాజస్వామి తెప్పోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం ఉభయ దేవేరీ సమేతం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారు తెప్పపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు పుష్కరిణిలో ఐదు ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రదర్శించిన హరికథ, భజనలు ఆకట్టుకున్నాయి. పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు. – తిరుపతి కల్చరల్

• నవీన 'నేస్తం'



బడి పిల్లల సృజనాత్మకతకు అక్షర రూపమే బాలల నేస్తం అని పలువురు వక్తలు వెల్లడించారు. శనివారం తిరుపతి ఇస్కాన్ రోడ్డు వద్ద మైదానంలో నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శనలో బాలల నేస్తం మాసపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సత్యనారాయణరాజు, ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, రచయితలు పెనుగొండ లక్ష్మీనారాయణ, వి.శివప్రసాద్, సాకం నాగరాజు, యువశ్రీ మురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, నేతలు మన్నవ గంగాధరప్రసాద్, తోట వెంకటేశ్వర్లు, గొడుగు చింత గోవిందయ్య పాల్గొన్నారు. – తిరుపతి కల్చరల్

గ్రంథాలయ ఉద్యమంతో చైతన్యం



మాట్లాడుతున్న వల్లూరి శివప్రసాద్



పేరూరు బాలసుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్ : వందేళ్ల క్రితం గ్రంథాలయ ఉద్యమంతోనే సమాజం చైతన్యవంతమైందని, సంఘ సంస్కరణకు దోహదపడిందని గ్రంథాలయ పునర్వికాస వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ తెలిపారు. శనివారం ఎన్‌జీఓ కాలనీలోని అరవింద విద్యాలయంలో నిర్వహించిన గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ సభలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాల అభివృద్ధి, పూర్వ వైభవానికి రాష్ట్ర వ్యాప్త ఉద్యమ ఆవశ్యకతను వివరించారు. కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలు ప్రజాదరణ కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విజయవాడలో తలపెట్టిన భవిష్యత్ కార్యాచరణ సభకు పలు సాహిత్య సంస్థలు సంఘీభావం ప్రకటించాయి. ఈ సందర్భంగా వేదిక జిల్లా కమిటీ కన్వీనర్ రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అరసం రాష్ట్ర నేత సాకం నాగరాజు , జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువ శ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, సాహితీ సంస్థల ప్రతినిధులు డాక్టర్ డి.మస్తానమ్మ, టెంకాయల దామోదరం , మల్లారపు నాగార్జున, ఆర్‌సీకే రాజు, మూరిశెట్టి గోవింద్, వాకాప్రసాద్, పల్లెపట్టు నాగరాజు, మేఘనాథరెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు




శ్రీవారి ఆలయం వెలుపల మంత్రి సవిత, శోభారాజ్

తిరుమల : తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో మంత్రి సవిత, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యులు విజయభారతి సయానీ, టీటీడీ ఆస్థాన గాయకురాలు శోభారాజ్ తదితరులు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు.

అంధకారంలో.. అమ్మ ఆలయం

తిరుమల శ్రీవారి తల్లి వకుళమాత ఆలయంపై టీటీడీ అధికారులు శీతకన్ను వేశారు. స్వర్ణ కాంతులతో విరాజిల్లే మహత్తర సన్నిధి అంధకారబంధురంగా మార్చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో పునర్నిర్మించారనే కారణంతోనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో అమ్మను సేవించుకునేందుకు తరలివచ్చిన భక్తులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే మహిమాన్విత గుడిని చీకట్లు కమ్ముకుంటున్నాయని మండిపడుతున్నారు. అత్యాధునిక జనరేటర్ అందుబాటులో ఉన్నప్పటికీ నిరుపయోగంగా మిగిల్చేశారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా వివక్ష పూరిత వైఖరిని విడనాడి వకుళమాత ఆలయంలో వెలుగులు నింపాలని కోరుతున్నారు.

- పవర్ కట్ అయితే.. అంతే సంగతులు
- నిర్వహణలోపంతో భక్తుల ఇక్కట్లు
- పట్టించుకోని టీటీడీ అధికారులు
- నిరుపయోగంగా అత్యాధునిక జనరేటర్
- డీజిల్ లేదని తప్పకుంటున్న సిబ్బంది



చీకటిలో వకుళమాత ఆలయం



తిరుపతి రూరల్ : మండలంలోని పాతకాల్వ సమీపంలోని పేరూరు బండ మీద వెలసిన వకుళామాత ఆలయం తరచూ చీకట్లో మగ్గుతోంది. రాత్రివేళల్లో అనుకోని అవాంతరాల వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోతే తిరిగి పునరుద్ధరించే వరకు అంధకారం ఆవరిస్తోంది. ప్రధాన ఆలయంతో పాటు పరిసరాలు చీకట్లోనే ఉంటున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు చీకట్లో కొండ దిగలేక పడరానిపాట్లు పడుతున్నారు. అంతేకాక అమ్మవారి ఆలయం నిర్మించిన కొండ చుట్టూ భద్రతా చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రహరీ గోడ ధ్వంసమైనప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. అమ్మవారి ఆలయ భద్రతపై టీటీడీ అధికారులు చూపుతున్న అలసత్వానికి ఇదే నిదర్శనం

నిర్లక్ష్యపు నీడలో..

శిథిలావస్థలోని వకుళామాత ఆలయాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నిధులతో పునర్నిర్మించారు.. 2022 జూన్ 23 వ తేదీన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతులు మీదుగా ప్రారంభించారు. తదనంతరం ఆలయ నిర్వహణ బాధ్యతలను టీటీడీ చేపట్టడంతో మరింత మెరుగైన వసతులు, అభివృద్ధి పనులు చేపడతారని భక్తులు ఆశించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిస్థితి మారిపోయింది. టీటీడీలో నూతన అధికారులు, కొత్త పాలకమండలి రావడంతో వకుళమాత ఆలయంపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి.

భక్తుల అసహనం



ఆలయంలోని జనరేటర్

అమ్మవారి ఆలయంలో అత్యాధునిక జనరేటర్ అందుబాటులో ఉంది. అయితే పవర్ కట్ అయినప్పుడు ఆ జనరేటర్‌ను వినియోగించడం లేదు. దీంతో విద్యుత్ పునరుద్ధరణ జరిగే వరకు ఆలయ ప్రాంగణంలో అంధకారం అలుముకుంటోంది. భక్తులు గంటల తరబడి చీకట్లోనే గడపాల్సి వస్తోంది. ఆలయ సిబ్బందిని ప్రశ్నిస్తే జనరేటర్ వేసేందుకు డీజిల్ లేదని తెగేసి చెప్పేస్తున్నారు. దీనిపై భక్తులు తీవ్రంగా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిష్టాత్మక ఆలయంలో భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా టీటీడీ అధికారులు అలసత్వం వహించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా శ్రీవారి తల్లి వకుళమాత ఆలయంపై టీటీడీ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

తిరుచ్చిపై వెంకన్న విహారం



ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం తిరుచ్చి వాహనంపై దేవదేవేరులను కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ ఇన్‌స్పెక్టర్ ముని కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

'బెల్టు' తీశారు!

చంద్రగిరి: అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తున్న నిర్వాహకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన శనివారం మండల పరిధిలోని తొండవాడలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుమన్ కథనం.. తొండవాడ గ్రామానికి చెందిన రాజేంద్ర బెల్టు దుకాణం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సీఐ సుబ్బరామిరెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ తన బృందంతో కలసి దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 21 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

భార్యాబిడ్డల అదృశ్యంపై ఫిర్యాదు

తిరుపతి క్రైమ్ : తన భార్యాబిడ్డలు కనిపించడం లేదని వెంకటేష్ అనే వ్యక్తి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. లక్ష్మీపురంలో వెంకటేష్, సుహాసిని దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు కిషోర్, ముని ప్రియ ఉన్నారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం నగల విషయమై భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో మనస్తాపం చెందిన సుహాసిని ఇద్దరు పిల్లలను తీసుకుని ఇల్లు వదిలి వెళ్లిపోయింది. ఎక్కడ వెతికినా ఆచూకీ దొరకలేదు. వెంకటేష్ ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రన్నింగ్ బస్సు ఎక్కుతూ..!



గాయపడిన షేక్ రఫీ

చంద్రగిరి : రన్నింగ్ బస్సు ఎక్కుతూ జారి కిందపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. శనివారం తిరుపతికి చెందిన షేక్ రఫీ చంద్రగిరిలోని బంధువుల ఇంటికి వచ్చాడు. తిరుగుప్రయాణంలో స్థానిక టవర్ క్లాక్ వద్దకు చేరుకున్నాడు. పుంగనూరు నుంచి తిరుపతికి వస్తున్న ఆర్టీసీ బస్సును రన్నింగ్‌లో ఎక్కేందుకు యత్నిస్తుండగా ప్రమాదం జరిగింది. కాలుపై బస్సు ఎక్కడంతో తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు.

కబ్జా ఆరోపణలు అవాస్తవం



మాట్లాడుతున్న బాధితుడు గిరిధర్ మురారి

తిరుపతి కల్చరల్ : రేణిగుంట మండలం కొత్తపాళెంలో సర్వే నెంబర్ 104/1ఎ, 104/5ఏలోని భూమిని తాము కబ్జా చేశామని చంద్రగిరికి చెందిన భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్ చేసిన ఆరోపణలు అవాస్తమని బాధితులు గిరిధర్ మురారి, నాగరాజు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. సర్వే నెంబర్లలోని 2. 74 ఎకరాలు పాడి కృష్ణారెడ్డి పేరుతో రికార్డు ఉందన్నారు. ఆ భూమికి భాగ్యలక్ష్మికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అయితే తప్పుడు పత్రాలు సృష్టించి తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు స్పందించి భాగ్యలక్ష్మిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రామ్మూర్తి, ఆంజనేయులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు సహించం



మాట్లాడుతున్న పరమశివన్

తిరుపతి కల్చరల్ : అంబేడ్కర్ భవన్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించే ప్రసక్తే లేదని భవన్ కమిటీ చైర్మన్ పి.పరమశివన్ స్పష్టం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ దళితులకు సేవలందిస్తున్న అంబేడ్కర్ భవనంపై ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు చెంగల్రాయులు, ధర్మయ్య అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గతంలో ఎంపీ గురుమూర్తి చేయూతనందించేందుకు ముందుకు వచ్చినా మోకాలడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నేతలు కె.నాగేశ్వరరావు, సభ్యులు పుష్పరాజు, ఇంద్రముని, రామచంద్రయ్య, గోపి పాల్గొన్నారు.

నేడు శాకాహార సద్భావన ర్యాలీ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : అహింసా ధ్యాన మహోత్సవంలో భాగంగా ఆదివారం మహతి కళాక్షేత్రం నుంచి శాకాహార సద్భావన మెగా ర్యాలీ నిర్వహించనున్నట్లు తిరుపతి స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు కంచి రఘురామ్ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తిరుపతి స్పిరిచ్యువల్, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉదయం 7 నుంచి 9 గంటల వరు మహతిలో సంగీత కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం మహతి నుంచి ప్రకాశం రోడ్డు, గాంధీ రోడ్డు, బండ్ల వీధి, రైల్వేస్టేషన్, కర్నాల వీధి మీదుగా ర్యాలీ సాగుతుందని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న సదస్సుకు పలువురు ప్రముఖులు హాజరై ధ్యానం, శాకాహార విశిష్టతపై ప్రసంగిస్తారన్నారు. ఈ క్రమంలో కార్యక్రమ ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. నిర్వాహకులు సంగీతబాబు, కేశవరాజు, శివ, జయరామిరెడ్డి, రాజేష్, చంద్రశేఖర్, భాస్కర్‌రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

హోటల్‌కు బాంబు బెదిరింపు



హోటల్ వద్ద జాగిలాలతో తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుపతి రూరల్ : నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్కు శనివారం రాత్రి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చినట్లు యాజమాన్యం తెలిపింది. 'అచ్చి ముత్తు సవుక్కు శంకర్' అనే పేరుతో వచ్చిన మెయిల్ చూసిన హోటల్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన పోలీసులు బాంబ్, డాగ్ స్క్వాడ్ లను రంగంలోకి దింపి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఎక్కడా ఏమీ లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గత రెండు వారాలలో ఇలాంటి బెదిరింపు మెయిల్స్ రెండు పర్యాయాలు వచ్చినట్లు హోటల్ యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు సైబర్ పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

బీజేపీ నేతల సంబరాలు



నినాదాలు చేస్తున్న బీజేపీ నేతలు

చంద్రగిరి : ఢిల్లీ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో ఆ పార్టీ నేతలు శనివారం చంద్రగిరి టవర్ క్లాక్ సెంటర్ వద్ద సంబరాలను జరుపుకున్నారు. బాణసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుపరిపాలనకు ఈ ఫలితాలే నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, నేతలు సుబ్రమణ్యం యాదవ్, సునీల్ కుమార్ యాదవ్, దొరస్వామి, నరేష్ కుమార్ నాయుడు, కృష్ణమూర్తి నాయుడు పాల్గొన్నారు.

• 'సులభ్'ంగా వదలం!



జనసేన నేతల పబ్లిసిటీ పిచ్చి పీక్స్‌కు చేరింది. అక్కడ ఇక్కడ అనే తేడా లేకుండా తయారైంది. చివరకు సులభ్ కాంప్లెక్సులను కూడా తమ ఫెక్సీలతో నింపేస్తున్నారు. ఈ క్రమంలోనే తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి సమీపంలోని పబ్లిక్ టాయిలెట్స్ వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పోస్టర్‌ను ఏర్పాటు చేసేశారు. దీనిపై స్థానికులు ఇదెక్కడి గోలరా బాబూ అంటూ తలలు పట్టుకుంటున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఎస్వీయూలో వేతన వెతలు!



తిరుపతి సిటీ : ఎస్వీయూలో వేతన జీవుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఏడు నెలలుగా సకాలంలో జీతాలు అందకపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ నెల 9 తేదీ వచ్చినా వేతనాల ప్రస్తావనే లేదని ఉద్యోగులు, పెన్షనర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తామని హామీలు గుప్పించిన కూటమి నేతలు ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్వాకంతో కుటుంబపోషణకు ఇబ్బందిపడుతున్నామని వాపోతున్నారు. ఇక బ్యాంకు రుణాలు, ఈఎంఐల చెల్లింపులకు ఏం చేయాలో తెలియక కొట్టుమిట్టాడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. కనీసం నిత్యావసరాలు తెచ్చుకునేందుకు సైతం అవస్థలు పడుతుంటే వర్సిటీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.